క్లుప్తంగా

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు



రైతులకు పశుగ్రాస విత్తనాలను అందజేస్తున్న పశువైద్యులు

కళ్యాణదుర్గం: సబ్సిడీపై పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలను అందజేస్తున్నట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట, ముదిగల్లు గ్రామాల్లో బుధవారం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పశు గణాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్, ఏడీ శ్రీనివాసగుప్తా, ఏరియా ఆసుపత్రి వైద్యులు రమేష్, మంజునాథ్ మాట్లాడారు. పాడి రైతులకు సీఎస్‌హెచ్-ఎంఎఫ్-23 రకం కేజీ రూ.23 ప్రకారం 75 శాతం సబ్సిడీపై 3,000 కేజీలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 50 టన్నుల దాణామృతం (టీఎంఆర్) కిలో రూ.6.50 ప్రకారం అందజేస్తామన్నారు. పశుగ్రాసం విత్తనాలు, దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



పాళ్లూరులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ గురుప్రసాద్

కంబదూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉంటుందని డాక్టర్ గురుప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పాళ్లూరు గ్రామంలో 104 వాహన సిబ్బంది అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అలాగే మండలంలోని తిమ్మాపురంలోని గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రమాద బీమా బాండ్ల పంపిణీ



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ఉద్యోగులు

కళ్యాణదుర్గం: అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ మోతిలాల్ నాయక్ అన్నారు. పట్టణంలోని స్థానిక విజయ్ ట్రేడర్స్ భవన సముదాయంలో బుధవారం తాపీ మేస్త్రీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, డీలర్ మధుసూదన్, నరేష్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ

కూడేరు: బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 10 రోజులు పాటు కొనసాగిన ఆంధ్రా వన్ సీఏటీసీ-2 శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ వైవీకే చైతన్యరెడ్డి క్యాడెట్లనుద్దేశించి ప్రసంగించారు. ఎన్‌సీసీలో శిక్షణ బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. ఎన్‌సీసీ అధికారులు సుధీర్, విజయ్ కుమార్,నాగేశ్వర రావు, వెంకటేశ్వర రావు, అనీల్ కుమార్, పరిమళ, రాధ, ప్రతాప్, శశిధర్, 508 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

ఐదు నెలల నుంచి బెంగళూరుకు వెళ్లి..

వలంటీర్లకు వందనం



బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో గుండురావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గిరిప్రసాద్‌రెడ్డి

ఈ ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గిరిప్రసాద్‌రెడ్డి. కంబదూరు మండలం మర్రిమాకులపల్లిలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన వృద్ధుడు బ్రహ్మణ గుండురావు పక్షవాతం సోకడంతో ఐదు నెలలుగా బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ గిరిప్రసాద్‌రెడ్డి.. సొంత ఖర్చులతో ప్రతి నెలా బెంగళూరుకు వెళ్లి రూ.2,750 పింఛన్ అందజేస్తున్నాడు. దాదాపు 220 కిలోమీటర్లు ప్రయాణించడం ఏనాడు భారంగా భావించలేదని వలంటీర్ తెలిపాడు. పింఛన్ సొమ్ము అందజేయడం తన బాధ్యత అని పేర్కొన్నాడు. – కంబదూరు:

వలంటీర్ సేవలు భేష్..



నాకు పక్షవాతం సోకడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను. బెంగళూరులో చికిత్స పొందుతున్నాను. ప్రతి నెలా పింఛన్ వస్తున్నా వెళ్లలేని పరిస్థితి. అయితే వలంటీర్ గిరిప్రసాద్‌రెడ్డి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నాడు. బెంగళూరుకు వచ్చి పింఛన్ అందిస్తున్నాడు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నాడు. ఐదు నెలలుగా వలంటీర్ ఇక్కడికే వచ్చి పింఛన్ సొమ్ము సంతోషంగా ఉంది. గిరిప్రసాద్‌రెడ్డి సేవలు మరువలేనివి.

– గుండూరావు, మర్రిమాకులపల్లి

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

కళ్యాణదుర్గం: నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి అని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు బీఎంవీ నరసింహారావు సూచించారు. పట్టణంలోని నర్సరీలను బుధవారం ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం లైసెన్స్, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. బిల్ బుక్కులు, రిజిష్టర్లు నిర్వహించాలన్నారు.

కుందుర్పి: రైతులకు నాణ్యమైన నారు అందించాలని నర్సరీ యజమానులకు ఉద్యానశఖ సహాయ సంచాలకులు బీఎంవీ నరసింహారావు, ఉద్యాన అధికారి గౌసియాబీ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని నర్సరీలను తనిఖీ చేశారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



విద్యార్థికి అవార్డు అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. బుధవారం తట్రకల్లులోని కస్తుర్బా బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రధానోత్సవానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. టెన్త్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు కె.దివ్య, కె.చంద్రకళ, సి.ప్రసన్న,డి.నజూమ్‌కు ప్రోత్సాహకబహుమతులతోపాటు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అనంతరం తట్రకల్లులో ఉరవకొండ-గుంతకల్లు మెయిన్‌రోడ్డు నుంచి కస్తుర్బా బాలికా విద్యాలయం వరకు ఉపాధి హామీ కింద రూ.38 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్సీ భూమిపూజ చేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్సీ సందర్శించి సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. సర్పంచులు కురుబ ధనలక్ష్మి, జయేం ద్రరెడ్డి, స్థానిక నాయకులుకులు శివలింగ, శ్రీనివాసులు, చంద్రశేఖ ర్,కిష్టన్న, తహసీల్దార్‌అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత, ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. బుధవారం గంజికుంటలో ఉరవకొండ-గుంతకల్లు మెయిన్‌రోడ్ నుంచి గంజికుంట వరకు రూ.60 లక్షలతో నిర్మించిన తారురోడ్డు రోడ్డును స్థానిక సర్పంచు జయేంద్రరెడ్డితో కలిసి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్బీకేను ప్రారంభించారు. తట్రకల్లులో ఉరవకొండ-గుంతకల్లు మెయిన్‌రోడ్ నుంచి తట్రకల్లు వరకు రూ.62 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. వైఎస్సా ర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే వలంటీర్లనే తిడతారా?

- జనసేన అధినేత పవన్, టీడీపీ అధినేత చంద్రబాబుపై ప్రభుత్వ విప్ కాపు ఫైర్



సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: ప్రజలకు వలంటీర్ల ద్వారా జగనన్న సర్కారు మంచి చేయడాన్ని జనసేన అధినేత పవన్, టీడీపీ నేత చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఫైర్ అయ్యారు. మంచి చేసే వలంటీర్లను కుక్కలే తిడతాయంటూ వారిని శునకాలతో పోల్చారు. కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో బుధవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో విప్ కాపు మాట్లాడారు. జన్మభూమి కమిటీలు లంచాలకు, దుర్మార్గపు పనులకు తెరలేపితే వలంటీర్లు అందుకు భిన్నంగా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెలిగి సేవలందిస్తున్నారు. సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోడీ వలంటీర్ల సేవలు భేష్ అంటూ ప్రశంసిస్తే ఈ కుక్కలు మాత్రం తిడుతుండడం యావత్తు దేశ ప్రజలందరికీ ఆశ్చర్యాన్ని కల్గించిందన్నారు. కరోనా సమయంలో పవన్, తప్పునాయుడు (బాబు), పప్పునాయుడు (లోకేష్)లు హైద్రాబాద్‌లో ఇళ్లకు పరిమితమైతే ఆ సమయంలోనూ ప్రజలకు సేవలందించిన గొప్ప సేవకులు వలంటీర్లని కొనియాడారు. రాయదుర్గం నియోజకవర్గంలో మాజీ మంత్రి కాలవ కూడా కరోనాకు భయపడి అడ్రస్ లేకుండా పోతే తాను... తన కుటుంబమంతా పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, శానిటైజర్లు, మాస్కులను పంపిణీ అండగా నిలిస్తే ప్రజలకు కాపు కరోనా వైరస్ అంటిస్తున్నారని ఆయన బయట తిరక్కుండా చూడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దుర్మార్గుడు కాలవని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఏఓ శ్రవణ్ కుమార్, ఈఓఆర్‌డీ గూడెన్న, సర్పంచు రుద్రమణి, వైస్ సర్పంచు హనుమంతు, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీనాయకులు కెనిగుంట రామిరెడ్డి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

కణేకల్లు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కణేకల్లు మండలంలోని నాగేపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు ఫణీంద్రగౌడ్, ఎంపీటీసీ జయరాం, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ కాపు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెత్తందార్ల పక్షాన పనిచేస్తుందని, జగనన్న ప్రభుత్వం పేద, బడుగు వర్గాల పక్షాన పనిచేస్తుందని వివరించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల లబ్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నాగార్జున ఇంటికి వెళ్లగా, భార్య లక్ష్మి శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. తమ కుటుంబానికి రూ. 7 లక్షలు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, తమకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, ఎంపీపీ సంధ్య, కణేకల్లు పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్ప చౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎండ్రకాయల వండ్రప్ప, సర్పంచ్‌లు తిప్పారెడ్డి, అంబాపురం భాస్కర్‌రెడ్డి, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, మండల అగ్రిగోల్డ్ చైర్మన్ ఆలేరు లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మిగనూరు గోవర్ధన్ రెడ్డి, ఆనంద్‌గౌడ్, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బెళుగుప్ప: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం గుండ్లపల్లి, గంగవరం గ్రామాల్లో సర్పంచ్‌లు పురుషోత్తం, రోజా అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ ఓబుశేసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గంగవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య హాజరయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశాన్ని అసిస్టెంట్ కలెక్టర్ ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీపీ పెద్దన్న, ఎంపీటీసీ ప్రసాద్, గ్రామ సర్పంచ్ రోజాలతో కలసి ప్రజలకు ధ్రువపత్రాలను అందజేశారు. గుండ్లపల్లిలో వైస్ ఎంపీపీ రేఖమ్మ, సర్పంచ్ పురుషోత్తంలతో కలసి మండల నోడల్ ఆఫీసర్ ధ్రువపత్రాలను అందజేసారు. ఎంఈఓ మల్లారెడ్డి, డీటీ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్‌బాబు, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, ఏపీఎం ఆంజనేయులు, స్థానిక నాయకులు వెంకటరెడ్డి, రామాంజినేయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: గడేకల్లు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచు సుశీల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఓబుళేసు, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత వ్యాపారులపై దాడి అమానుషం



ధర్నా చేస్తున్న వ్యాపారులు

రాయదుర్గం రూరల్: చేనేత వ్యాపారులపై విచక్షణా రహితంగా దాడి చేయడాన్ని రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్ వ్యాపారులు తీవ్రంగా ఖండించారు. ధర్మవరం చేనేత వ్యాపారులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణ రెడిమేడ్ గార్మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంతు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ ధర్మవరం చేనేత వ్యాపారులపై విజయవాడకు చెందిన ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్ తన అనుచరులతో కలిసి విచక్షణరహితంగా దాడి చేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వస్త్ర వ్యాపార లావాదేవీల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం విధి విధానాలు రూపొందించాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారులు ఉన్నారు.

బోగస్ సర్టిఫికెట్లు సృష్టించి విలువైన స్థలాల కబ్జా



మాట్లాడుతున్న ఆలయకమిటీ సభ్యులు, నాయకులు

రాయదుర్గం: లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చలామణి అవుతున్న వెంకటరమణ (బాబు) బోగస్ సర్టిఫికెట్లు సృష్టించి విలువైన స్థలాల కబ్జా చేస్తున్నాడని బసవనాగలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ ఏటూరి అనిత సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏటూరి మహేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామనాథం, ఉపాధ్యక్షులు బసవరాజు, కార్యదర్శి తిరుమలేష్, సహాయ కార్యదర్శి శరత్‌బాబు మాట్లాడారు. ఇప్పటికే పట్టణంలో 8 నుంచి 10కి పైగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశాడన్నారు. బసవ నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద 11 సెంట్ల స్థలం ఉంటే, అందులో కొంతమేర కబ్జా చేశాడని ధ్వజమెత్తారు. తాజాగా ఆలయానికి సంబంధించిన కార్యాలయానికి వెళ్లే ప్రధాన దారికి అడ్డుగా కంచె నిర్మిస్తుండడంతో అడ్డుకున్నామని వివరించారు. వివరాలతో సహా పోలీసులు, రెవెన్యూ అధికారులును కలసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. శివ భక్తులు, హిందువులంతా కదిలి దురాక్రమణను అడ్డుకోవాలని విజ్ఞప్తిచేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

విడపనకల్లు: జగనన్న ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, మాజీ సర్పంచు సీనియర్ నాయకులు భీంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి అర్హత ఉన్నప్పటికీ చాలా మంది చిన్న,సన్నకార రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఇతర ఏ పథకాలు అందించలేదన్నారు. కేవలం జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికి మాత్రమే పథకాలు అందేవన్నారు. జగనన్న ప్రభుత్వం అర్హులందరికీ ఎవరి ప్రమేయం లేకుండా పథకాలు అందుతున్నాయన్నారు. విడపనకల్లు మండలంలోని మిర్చి రైతులకు గతేడాది దాదాపు రూ.100 కోట్లు బీమా మంజూరైందని గుర్తు చేశారు. టీడీపీ నాయకులకు సైతం రూ.లక్షల్లో బీమా పొందారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వీరశైవ లింగాయితీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దండిన శివానంద, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ సంఘ విద్రోహశక్తి



డి హీరేహాళ్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సంఘ విద్రోహశక్తిగా మారిపోతున్నాడని వలంటీర్లు విమర్శించారు. వలంటీర్లపై ఆయన చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. పవన్ అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నట్లు అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. వలంటీర్ల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని తెలిపారు. పవన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. వలంటీర్లకు వైఎస్సార్సీపీ నాయకులు అండగా వుంటారని పలువురు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ చిత్రశేఖరప్ప, అనంతరెడ్డి, తదితరులు పాల్గొని మద్దతు పలికారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే..

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లిలో బుధవారం పవన కళ్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేశారు. వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై అసభ్యకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

'పవన్‌ను రాష్ట్ర బహిష్కరణ చేయాలి'

రాయదుర్గం: పవన్ కళ్యాణ్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. డి హీరేహాళ్‌లోని బళ్లారి- బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం బైఠాయించి పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ప్రధాన సర్కిల్‌లో నిప్పుపెట్టి చిత్రపటాన్ని చెప్పులతో కొట్టారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ.. కోవిడ్ సమయాన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించిన ఘనత ప్రతి వలంటీర్‌కు దక్కుతుందన్నారు.

సీఎంకు రుణపడి ఉంటా

ఉరవకొండ: అడిగిన వెంటనే ఆర్థికసాయం అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని పెద్దకొకుంట్లకు చెందిన కల్పన పేర్కొన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కొనకొండ్ల శివరామిరెడ్డి ఈనెల 8న కళ్యాణదుర్గం పర్యటనకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తనను తీసుకెళ్లి తన కుటుంబ దుస్థితిని తెలియజేశారన్నారు. స్పందించిన సీఎం వెంటనే కలెక్టర్ గౌతమిని ఆర్థికసాయం చేయాలని ఆదేశించారన్నారు. ఈమేరకు కలెక్టర్ రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

బ్రహ్మసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ దాసానాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఓడీ తప్పనిసరి

కూడేరు: కుష్టు బాధితులు తప్పనిసరిగా సోకింగ్, స్క్రాపింగ్, ఆయిలింగ్, డ్రెస్సింగ్(ఎస్ఎస్ఓడీ) విధానాలను పాటించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మనోజ్ సూచించారు. బుధవారం కుష్టురోగుల కాలనీలో అంగవైకల్య నివారణ, వైద్య పునరావాస శిబిరాన్ని నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సూచించారు. బుధవారం కొనకొండ్ల ప్రభుత్వాస్పత్రి వద్ద డెంగా నివారణ మాసోత్సవాల ర్యాలీని ఎమ్మెల్సీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దోమలు పెరగకుండా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర, వైద్యాధికారి గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలెప్ప, గురు, శ్రీరాములు, హనుమంతు, చుక్కా మల్లి, చుక్కారాజు, మునీంద్ర, కుమ్మర అంజి, తిప్పయ్య, పాపన్న, తహసిల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత పాల్గొన్నారు.

బెళుగుప్ప: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పేర్కొన్నారు .బుధవారం వెంకటాద్రిపల్లి, శీర్పికొట్టాల గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలసి ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం వెంకటాద్రిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బాలాజీతో కలసి విద్యార్థులకు దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ వసంత, ఎంపీహెచ్ఈఓ తిరుపాలయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి భూమిపూజ

కుందుర్పి: మండల కేంద్రంలో పంట ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్ కోసం కోల్డ్‌స్టోరేజ్, కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి బుధవారం ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, నాబార్డ్ డీడీఎం అనురాధ, హార్టీకల్చర్ అధికారి నరసింహారావు భూమిపూజ చేశారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు 706 మంది వాటదారులతో కలిసి ఏఎఫ్ ఎకాలజీ, నాబార్డు సహాయంతో కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఆర్ఐగా ప్రసన్న కుమార్

కూడేరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా ప్రసన్నకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన డీహీరేహాళ్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఓటర్ల వాస్తవికతను గుర్తించాలి

గుమ్మఘట్ట: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వాస్తవికతను గుర్తించాలని తహసీల్దార్ బ్రహ్మయ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓల యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి

శెట్టూరు: మండలంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లను త్వరగా నిర్మించాలని నోడల్ ఆఫీసర్ నీలమయ్య సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఇంజినీర్ కాంచన, ఎంపీడీఓ మైథిలీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. డీటీ మహేశ్వర రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

కళ్యాణదుర్గం: బి.కొత్తూరు సమీపంలో బుధవారం బైకు అదుపు తప్పిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. బి.కొత్తూరు గ్రామానికి చెందిన హరిజన హనుమక్క తమ బంధువుతో కలిసి బైకులో కుందుర్పి నుంచి బి.కొత్తూరుకు వస్తోంది. కుందుర్పి దాటగానే బి.కొత్తూరు సమీపంలో బైకు అదుపు తప్పింది. వెనుక వైపు కూర్చొన్న హనుమక్క ఎగిరి కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు, దొడగట్ట గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ, శ్రీసత్యసాయి సేవా సమితి సౌజన్యంతో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన లభించింది. ముదిగల్లులో 317 పశువులు, దొడగట్టలో 287 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్, విశ్రాంత డాక్టర్ పున్నయ్యలు పాడి పశువులు, జీవాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. గర్భకోశ, నట్టల నివారణ, పిడుదులు, గోమారి నివారణకు మందులను అందజేశారు. డాక్టర్ మంజునాథ్, రమేష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కలగళ్ల ఇన్‌చార్జ్ వీఆర్వోగా లక్ష్మన్న

కూడేరు: కలగళ్ల, మరుట్ల రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్వోగా కొర్రకోడు వీఆర్వో లక్ష్మన్నను నియమించినట్లు తహసీల్దార్ శేషారెడ్డి బుధవారం తెలిపారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి

బెళుగుప్ప: మండలంలో ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డిప్యూటి కలెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య అధికారులకు సూచించారు. బుధవారం గుండ్లపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆర్బీకే, వైఎస్సార్ క్లినిక్, సచివాలయ భవన నిర్మాణాలను ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ మల్లారెడ్డి, పీఆర్ జేఈ సుధాకర్‌తో కలసి పరిశీలించారు. వైస్ ఎంపీపీ రేఖమ్మ, సర్పంచ్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల అందజేత

విడపనకల్లు: భవిత కేంద్రంలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు బుధవారం ఎంఈఓ బి.శ్రీనివాసులు, హెచ్ఎం మల్లికార్జున అందజేశారు. ఉపాధ్యాయులు సహిత విద్య, కెఆర్ మారెప్ప, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పశుపోషణ లాభధాయకం

విడపనకల్లు: పశుపోషణ లాభదాయకంగా ఉంటుందని పంశుసంవర్ధక శాఖ జెడీ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో రైతులకు పశుగ్రాస ప్రాముఖ్యతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉప సంచాలకులు డాక్టర్ వెంకటేష్, ఏడీడబ్ల్యూ డాక్టర్ రంగస్వామి, డాక్టర్ వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

ప్రగతి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

గుమ్మఘట్ట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రగతి పనులలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా నిబద్ధతతో పనిచేయాలని డీఎల్‌డీఓ శంకర్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ, నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంఈఓలు నాగమణి, రామచంద్రలతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

రాయదుర్గం: రాయదుర్గం ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారని సీడీపీఓ ప్రభావతి తెలిపారు. డి హీరేహాళ్ మండలంలోని మురడి-2 బీసీ-బీ, ఎస్ఆర్ కోట ఓసీ, రాయదుర్గం మండలం ఆవులదట్ల ఓసీ కి చెందిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 19 సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే సమయం ఉందన్నారు.